# శరణాగతి

**శ్రీ పీతాంబరం వెంకట గోవిందాచార్యులు**, విశాఖపట్నం.

అహం బ్రహ్మాస్మి – నేను బ్రహ్మమునను, శివోహం – అఖండానందమైన ఆత్మను నేను; సోహం – నేను బ్రహ్మమునే, నేను పరమాత్మనే; సచ్చితానంద స్వరూపోహం – నేను సత్ చిత్ ఆనందము యొక్క మూర్తి స్వరూపమును.

## బ్రహ్మము

అనంతమైన అంతరిక్షంలో జ్యోతిర్గోళాలకు జ్యోతియై వెలుగొందే పరం జ్యోతి, యుగాలను సృష్టించే, ప్రవర్తింపజేసే, కబళింపచేసే కాలపురుషుడు, జననంలేనివాడు, స్వయంసిద్ధుడు, పదివ్రేళ్ళ పొడవున సర్వ లోకముల నధిగమించి యున్నాడు. అతడీ లోకములను అన్ని వైపుల నుండి ఆవరించి యున్నాడు. అన్ని లోకములు, జలరాశి, అగ్ని, వాయువు, అంతరిక్షము అతని పరిమాణములో చిన్ని భాగములు.

## నేను

ఈ ఒక్క జగత్తునందలి కోట్లాది జీవరాసులలో ఒక జీవిని. శరీరాభిమానము, స్వతంత్రుడననెడి అవివేకపు తలంపు, స్వీయ రక్షణకు ఆరాటము, ప్రాపంచిక వ్యామోహములందు ఆకర్షణ, నశ్వరమైన శరీర బాంధవ్యములతో బంధము నేర్పరచుకొనుట అనెడి ప్రమాదములతో కూడి యున్న విషమయమైన సంసారమునందు మ్రగ్గుచున్న వాడను.

ఇంతటి వ్యత్యాసమున్నపుడు నేను బ్రహ్మమును అనుకొనుట ఎట్లు? ఇది తెలియుటకు పరమాత్మ, ఆత్మ, జీవుడు అనగా నేమియో తెలుసుకొనవలెను. సర్వత్ర వ్యాపించిన పరిపూర్ణ చైతన్యమే పరమాత్మ లేక బ్రహ్మము. బుద్ధియందు వ్యాప్తమైన చైతన్యమే ఆత్మ. బుద్ధియందు వ్యాప్తమై యున్న చైతన్యము యొక్క ప్రతిబింబమును అభాస చేతనమందురు. ఇదియే జీవుడు. ఒకదాని ప్రతిబింబము దాని కన్న ఎట్లు వేరు కాదో అట్లే జీవుడు పరమాత్మ కంటె వేరు కాదు. ఆత్మ బుద్ధియందు వ్యాప్తమై యున్న చైతన్యమే కనుక పరమాత్మ కన్న వేరు కాదు. ప్రతిబింబము మిధ్య. కనుక మిధ్యయైన జీవుడు శరీర తాదాత్మ్యము చెంది ప్రకృతి వికారములకు లోనై చేయు కర్మలను జీవాత్మకు ఆరోపించుకొని కర్తగా, భోక్తగా భ్రమించుచున్నాడు. ఇట్టి మిధ్యా భ్రమ వివేకముద్వారా పోగొట్ట గలిగినపుడు జీవుడు పరమాత్మతో అభిన్న భావముతో నుండును. శుద్ధ చేతనము పరమాత్మ. ఆ చేతనము యొక్క ప్రతిబింబము స్థూల, సూక్ష్మ, కారణములను మూడు ఉపాదులందున్నపుడు జీవుడన బడుచున్నది.

శరీరాదులందు ఆత్మ అనెడి బుద్ధి యుండుటనే మాయ అందురు. ఈ మాయ వలన సంసారము కల్పింపబడినది. శరీరమే ఈ సంసార రూప వృక్షమునకు దృఢమైన మూలము. దాని కారణముననే పుత్ర కళత్రాది బంధము కలుగుచున్నది. స్థూల భూతములు, అహంకారము, బుద్ధి, దశేంద్రియములు,

> దుఃఖమునకు దేహమే మూలము. దేహము కర్మఫలితములను అనుభవించుటకు ప్రాప్త మగును. దేహమునందలి అహంకారము వలన దేహమే నేను అను బుద్ధి కలుగుచున్నది.

మానవుడు ఆశ్రిత సులభుడగు **పరమాత్మను బంధ విముక్తికై శరణు వేడవలెను. కర్మ లన్నియు పరమాత్ముని ఆనందము కొరకే అన్న భావనతో జీవయాత్ర సాగించ వలెను.**

దేహాభిమానము, మనస్సు, మూల ప్రకృతి యను వాని సమూహమే ఈ శరీరము. జీవుడు శరీరము కన్న వేరైనవాడు. దేహము కాష్ఠమువలె జడము. జీవుడు నిత్యుడు, చైతన్య ప్రతిబింబ స్వరూపుడు. మనస్సే సంసారము, బంధము. జీవుడు మనస్సుతో ఏకమగుటవలననే తత్సంబంధములైన సుఖ దుఃఖాది రూప బంధములను పొందుచున్నాడు. బుద్ధి ఇంద్రియాదులకు సమీపముగా నుండుటచేత జీవుడు మనస్సును స్వీకరించి దానివలన పుట్టెడి రాగ ద్వేషాది గుణముల ప్రభావమునకు లోనై సంసార చక్రమున తగులుకొనును. నానా విధ కర్మల నాచరించుచుండును. ఇట్లు జీవుడు కర్మలకు వశీభూతుడై ప్రళయ పర్యంతము జనన మరణ చక్రములో పడియుండును. ప్రళయ కాలమున భూతము లన్నియు లయమైనను, కర్తృత్వ భోక్తృత్వము లందలి అభిరుచులచే పూర్వ వాసనలు, కర్మల ఫలితములతో జీవుడు చలన రహిత స్థితిలో నుండును. సృష్టి కాలము నందు తన పూర్వవాసనలున్న మనస్సుతో కూడి జీవుడు మరల జనన మరణ చక్రమునందు చిక్కుకొనును.

దుఃఖములకు దేహమే మూలము. దేహము కర్మ ఫలితముల ననుభవించుటకు ప్రాప్తమగును. దేహమునందలి అహంకారము వలన మరల కర్మ ప్రవృత్తి సంభవించును. అహంకారము వలననే దేహమే నేను అను బుద్ధి కలుగుచున్నది. ఇది సంసారమునకు మూలమగు చున్నది. నిర్వికారుడగు జీవునితో దేహమునకు కలిగిన మిథ్యా తాదాత్మ్యమువలన జీవుడు దేహము చేయు కర్మలకు తానే కర్తనని సంకల్పించుచుండును. దాని వలన ఆయా కర్మఫలములకు బద్ధుడగును. పాప, పుణ్య కర్మల కారణమున జనన మరణ రూప సంసార చక్రముననే పడి జీవుడు తిరుగుచుండును. దేహము నేను అను మిథ్యా భావన చేతనే దేహాభిమానియై జీవుడు నరక, గర్భవాసాది దుఃఖములను పొందుచున్నాడు. పిపీలికాది బ్రహ్మ పర్యంతముగల దేహ, బుద్ధి, ఇంద్రి యాదులు, చరాచర జగత్తు ప్రకృతి అని పిలవబడును. ఇదియే మాయ అని కూడ చెప్పబడును. ఇది త్రిగుణములతో జీవుల దేహములనుత్పత్తి చేయుచు సంసార రూప వృక్షము యొక్క ఉత్పత్తి, స్థితి, వినాశము లకు కారణమగుచున్నది. మాయా గుణము లగు కామ, క్రోధ, హింస, తృష్ణాదులు జీవుని దివారాత్రములు మోహింపజేసి తన స్వస్వ రూపమును మరిపింప చేయుచున్నవి. జీవుడు చావు పుట్టుకలు లేని నాశరహితుడు, శాశ్వతుడు. కాని వానికి దేహేంద్రియములు స్థిర రహితములై రాకపోకలు గలిగి వచ్చుచు పోవుచుండును. సుఖము, జ్ఞానము అనువాని యందలి ఆసక్తి చేత సత్త్వ గుణము జీవుని బంధింప గలుగు చున్నది. రాగము, తృష్ణ, సంగమము, కర్మాసక్తి చేత రజోగుణము జీవుని బంధింపగలుగు చున్నది. సోమరితనము, నిద్ర మున్నగు వాని చేత తమో గుణము జీవుని బంధింప గలుగుచున్నది. కనుక బుద్ధి చేత మనస్సును నియమించి, కోరికలు విసర్జించి, దుఃఖవిరక్తిగాని సుఖాసక్తి కాని లేక, అనురాగ భయ కోపములను తొలగించుకొని మనస్సును అంతర్ముఖ మొనర్చుకొని కర్మఫలాసక్తి లేక నిత్య సంతృప్తితో దేహధారణా కారణముగ కర్మలు చేసిన ఆ కర్మఫలములు యొక్క కర్తృత్వ భోక్తృత్వములు జీవుని బంధింపవు. ఇష్టా నిష్టములు, సుఖ దుఃఖములు మున్నగు వానియందు సమదర్శనా భావము కలిగి, సర్వ కర్మ ఫలములను వదలినచో అట్టి జీవుడు త్రిగుణముల కతీతుడగును. త్రిగుణములను దాటిన జీవుడు పరమాత్మ తోడ అభిన్న భావముతో నిలిచి యుండును. మాయా గుణములచే మోహితుడై తన స్వరూపమే మరచి పోయిన జీవుడు త్రిగుణాత్మకమైన ఈ ప్రకృతీ బంధములను తనంత తానుగా ఛేదించు కొనుట సాధ్యము కాదు. ఊబిలో కూరు కున్నవాడు బయటికి వచ్చుటకు ఎంత ప్రయత్నించినను తనంత తానుగా వెలుపలకి రాలేడు కదా! వెలుపల నున్న ఒక బలసాలి వచ్చి అట్టి వానిని బయటకు లాగిన అతడు రక్షింపబడగలడు. అట్లే పర మాత్మయే ఎన్నటికైనను ఈ జీవునికి బంధముల నుండి విముక్తి కలిగించవలెను.

పరమాత్మ కృప ఏ జీవి ఎప్పుడు పొందగలడో ఎవరికిని తెలియదు. పరమాత్ముని క్రియాశీలత, గమన, చలన, చైతన్యాదులు మహామహులకు కూడ బోధపడవు. తనను గౌరవించి సేవించవలెననే అభిమానము పరమాత్మకు లేదు. కాని సేవించిన వారి పట్ల చూపవలసిన అభిమానం, ఆదరం ఆవగింజంత వ్యత్యాసమైనా లేకుండా చూపిస్తాడు. అనేకరూపుడైన విశ్వరూపునికి ప్రత్యేకంగా ఒక రూపములేదు. అనేక రూపాలతో, అనంత విభూతితో ఏ

## వృద్ధులు, వికలాంగులకు శ్రీవారి దర్శనం

**వయో వృద్ధులు, వికలాంగులు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని నేరుగా మహద్వారం నుంచి ప్రవేశించి దర్శించ వచ్చు. వారికి తోడుగా ఒక సహాయకుని కూడా అనుమతిస్తారు. వృద్ధులు, వికలాంగులు మహద్వారం వద్ద నున్న అధికారిని సంప్రదించి నేరుగా శ్రీవారి దర్శనానికి వెళ్లవచ్చు.**

**వారు ఆ అధికారివద్దనే శ్రీవారి ప్రసాదమైన లడ్డూల టోకెన్లు (2) కూడా పొందవచ్చు. ఆ లడ్డు ఒక్కొక్క దానికి రూ 10 వంతున లడ్డూ కౌంటర్ల వద్ద చెల్లించి లడ్డూలను పొందవచ్చు.**

రూపంలో భావిస్తే ఆ రూపంలో సాక్షాత్కరిస్తాడు. సర్వ సంగ పరిత్యాగులై అరణ్యములలో తపంబుల నాచరించెడి యోగి పుంగవులకే దర్శనము నొసంగి ఆ బ్రహ్మము నిరక్షరాస్యురాలైన ఒక గొల్ల వనితకు వశుడై ఆమె ఆంక్షలను ఔదల దాల్చి సంచరించెను. అట్లే విద్యావిహీనులైన గొల్ల భామలను తన మురళీరవముతో సంకేతము నందించి తన సాన్నిధ్యమునకు రప్పించుకొనెను. అన్ని లోకాలకు దిక్కు, రక్షకుడు, శరణ్యుడు అయిన బ్రహ్మము తన విప్పారిన నేత్రాలతో సర్వాన్ని తిలకిస్తూనే ఉంటాడు. కనుక జీవుడు చేయగలిగినది ఆర్తితో పరమాత్మను శరణు వేడు కొనుటయే.

జీవుల అశక్తత తెలియుట చేతనే పరమాత్మ జీవుడు బంధ విముక్తుడగుటకు చేయవలసిన ఉపాయమును తనంత తానుగా తెలియజేసెను.

### పరమాత్ముని వాణి:

''సకృదేవ ప్రపన్నాయ
తవాస్మీతి చయా చతే
అభయం సర్వభూతే భ్యో
దదామ్యే తద్వ్ర తం మమ.''

అనగా నేను నీ వాడనని ప్రార్థించుచు ఒకేసారి శరణాగతుడైనవానికి సకల ప్రాణుల నుండియు అభయము నొసంగుట నా వ్రతమని నుడివెను.

''సర్వ ధర్మాన్ పరిత్యజ్య
మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వ పాపే భ్యో
మోక్షయిష్యామి మా శుచః.''

అనగా బంధవిముక్తికి సాధనము లుగా చెప్పబడిన అన్ని సాధనలను విడిచి నన్నొక్కనినే ఉపాయముగా నమ్మి యుండిన సర్వశక్తి మంతుడనగు నేను స్వీయరక్షణ చేసుకొనలేని జీవుని నను పొందుటకు ఆటంకములగు సమస్త పాపముల నుండి విడిపింతునని అభయ మిచ్చెను.

కనుక ఆశ్రిత సులభుడగు పరమాత్మనే బంధవిముక్తి నొసగించి జీవుడు శరణు వేడవలెను. రక్షణలో సమర్థుడైన ఓ పరమాత్మా! నేను ఈ సంసార బంధము నుండి విడివడుటకు ఉపాయ మొక్కటియు లేనివాడను, రక్షకు లెవ్వరును లేనివాడను. నేను నీ పాదములనే ఉపాయముగా, రక్షకముగా శరణు వేడు చున్నాను. నేను నీవాడను. నిన్నే పరమ ప్రాప్యముగా కలవాడనై నా మనస్సు నీయందే లగ్నము చేయుచున్నాను. అనాద్యంతమగు నిన్ను చేర గలనట్లు నన్ను చేయుము. నీ వొసంగిన ఈ దేహముతో చేసెడి మనో వాక్కాయ కర్మలన్నియు నీ కైంకర్యమునకేవి వినియోగపడు నట్లు చేయుమని వేడుకొనుచున్నాను. పరమాత్ముని స్మరించుకొనుచూ ఈ దేహముతో చేసెడి కర్మలన్నియు పరమాత్ముని ఆనందము కొరకే అన్న భావనతో ఈ దేహయాత్ర సాగించినచో ఈ దేహముతో చేసెడి కర్మ ఫలములు ఆ దేహమునందున్న జీవుని బంధింపక ఈ ప్రకృతీ బంధములనుండి ఆ జీవుని విడిపించి పరమాత్మ సాన్నిధ్యమున అభిన్న భావముతో నుండునట్లు చేయును.

ఇపుడు శరణాగతి చేయుటయే జీవుని కర్తవ్యమైనది. జీవుని బంధవిముక్తుని చేసి తన సాన్నిధ్యమునకు చేర్చుకొనెడి బాధ్యత ఆ సర్వ శక్తిమంతుడగు పరమాత్మదైనది కనుక శరణా గతే జీవులందరికి సులభమైన మోక్షోపాయము.

